సాగు భూములకు పెరిగిన కౌలు !

• పత్తి సాగులో లాభాలే కారణం


మునుగోడులో ఓ రైతు ఇచ్చిన కౌలు భూమి

మునుగోడు: కౌలు భూములకు గత ఏడాది కంటే ఈ ఏడాది డిమాండ్ భారీగా పెరిగింది. అందుకు ప్రధాన కారణం ఈ ఏడాది పత్తి పంటకు అధిక ధర పలకడంతోపాటు అధిక దిగుబడి రావడమే. గత ఏడాది అడపాదడపా వర్షాలు కురిసి పంటల దిగుబడి బాగానే వచ్చింది. దానికి తోడు పత్తి ధర కూడా బాగానే ఉండడంతో రైతులకు ఆదాయం సమకూరింది. రాబోయే సీజన్‌లో కూడా అదే స్థాయిలో ఉంటుందని భావిస్తున్న కౌలు రైతులు గతంలో కంటే అధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేయాలని భావిస్తున్నారు. కౌలు భూములకు పోటీ పెరగడంతో రైతులు ధరలను పెంచుతున్నారు.

ఎకరం భూమికి రూ.17 వేలకుపైనే

కౌలు భూములు తీసుకుని పంటలు సాగు చేసేవారి సంఖ్య అధికమవడంతో ఈ ఏడాది ఎకరం కౌలు రూ.17 వేలకు పైగా పలుకుతోంది. గతంలో ఏ కౌలు రైతు అయినా ఎకరానికి రూ.8వేల నుంచి రూ.10 వేలకుపైగా ఇచ్చి భూమి కౌలుకు తీసుకునే వారు. ఈ కానీ ఈ ఏడాది పోటీ పెరగడంతో రూ.17 వేల నుంచి రూ. 22 వేల వరకు ఇచ్చి తీసుకుంటున్నారు.

డివిజన్ వ్యాప్తంగా లక్షా 91వేల ఎకరాల భూమి

మునుగోడు డివిజన్ పరిధిలోని మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుప్పల్ మండలాల్లో మొత్తం లక్షా 86వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో అధికంగా లక్షా 65 వేల 361 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. 17,937 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా.. 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు కావడంతో ప్రతిఒక్కరూ పత్తి పంట సాగుచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది దాదాపు 20 వేల ఎకరాలకు పైగా పత్తి పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయ సిబ్బంది భావిస్తున్నారు.

ఎకరం కౌలు రూ.18వేలు చెబుతున్నారు



పదేళ్లుగా 20 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నా. మొదట ఎకరానికి కౌలు రూ.5వేలు ఇచ్చి సాగు చేశాను. ఏడాది క్రితం రూ.10వేలకు ఇచ్చారు. కానీ ఈ ఏడాది ఏకంగా ఎకరం రూ.18 వేల నుంచి రూ.25వేలు చెబుతున్నారు. అంత కౌలు ధర ఇవ్వకపోతే వేరేవారికి ఇస్తాం అంటున్నారు.

– బొడ్డు యాదయ్య, కౌలు రైతు మునుగోడు

పోటీ పడుతున్నారు



గతంలో భూమి కౌలుకు తీసుకునేందుకు ఒకరిద్దరు మాత్రమే వచ్చేవారు. ఈ ఏడాది మాత్రం దాదాపు 10 మందికిపైగా అడిగారు. నేను ధర ఎక్కువ చెప్పకపోయినా వాళ్లే ఎకరం రూ.18వేలు ఇస్తాం, రూ.20 వేలు ఇస్తామని పోటీ పడి వస్తున్నారు. ఈ ఏడాది పత్తిలో లాభాలు అధికంగా రావడం వల్లే కౌలు ధరలు పెరిగాయి.

– బి.ధనరాజ్, రైతు, మునుగోడు

వేసవిలో తాగునీటి ఎద్దడి రావొద్దు


ఛాయా సోమేశ్వరాలయాన్ని సందర్శించి, అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

• కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్ : వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, నీటి ట్యాంకుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తగిన ప్రణాళికలు రూపొందించాలని, స్థానికంగా విద్యుత్ సమస్య వస్తే మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం అక్కచెల్మ, అన్నేశ్వరమ్మ గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న ట్యాంకుల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. హిందూపూర్‌లో స్వర్గపురి వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు చేయాలి

రామగిరి(నల్లగొండ) : మహాశివరాత్రి సందర్భంగా పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిచేందుకు మంగళవారం ఆమె ఛాయా సోమేశ్వరాలయాన్ని సందర్శించారు. 26న శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. నీటి శుద్ధి వివరాలను మిషన్ భగీరథ ఈఈ వంశీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న జంతు జనన కేంద్రాన్ని సందర్శించి స్టెరిలైజేషన్ వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్వాతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయన ఈఓ బాలకృష్ణ పాల్గొన్నారు.


నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

గంగాభవాని జాతరలో భక్తుల సందడి


మూసీ నదిలో వెలిసిన గుడారాలు

కేతేపల్లి : మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ సమీపంలో గల మూసీ నది ఒడ్డున గంగాభవాని జాతరకు రెండో రోజు మంగళవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. నకిరేకల్ పరిసర ప్రాంతాల నుంచి సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు వెళ్లిన భక్తులు మంగళవారం తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో మూసీ నది ఒడ్డున ఉన్న గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. నదిలోని ఇసుక దిబ్బలు, పురాతన, నూతన వంతెనల కింద టెంట్లు వేసుకుని వంటావార్పు చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బోనం వండే పాలు, పెరుగు, బియ్యం, పసుపు కుంకుమ వంటి నవ ధాన్యాలున్న గంపలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మహిళలు దేవతకు నైవేద్యాన్ని సమర్పించారు. కాలికి గజ్జె కట్టి నృత్యాలు చేసుకుంటూ కోరికలు తీరాలని అమ్మవారిని వేడుకున్నారు. కోరిన కోరికలు తీరిన భక్తులు యాటలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొందకు భక్తులు తలనీలాలు సమర్పించారు. సుమారు 20వేల మంది భక్తులు జాతరకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఉప్పలపహాడ్ బంగారు మైసమ్మ ఆలయం వద్ద భక్తులకు పూజలు నిర్వహించారు ఈ ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ ముదిరెడ్డి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మర్రిగూడ : విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహించిన కరాటే క్యాంప్, సెమినార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కళా శ్రీనివాస్, జంబోకాయ్ ఏసియన్ సిటోరియా కరాటే డు ఫెడరేషన్ చీఫ్ కోచ్ బరిగెల దుర్గాప్రసాద్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ దుబ్బాక నగేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శేఖర్ అరెస్ట్ అప్రజాస్వామికం'

చండూరు : మాజీ కౌన్సిలర్, దళిత నాయకుడు అన్నెపర్తి శేఖర్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మాదిగ సామాజిక వర్గ నాయకులు అన్నారు. మంగళవారం చండూరులో జరిగిన మాదిగ సామాజిక వర్గ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీటీసీగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా సేవలందించిన మాజీ ప్రజాప్రతినిధిని ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కురుపాటి సుదర్శన్, ఇరిగి గురునాథం, ఇరిగి రామన్న, నలగంటి రమేష్, అన్నెపర్తి యాదగిరి, తీగల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

చిట్యాల: ఎరువులు, విత్తనాల కొనుగోలులో రైతులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇబ్బందులు పెట్టొద్దని చిట్యాల మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు హెచ్చరించారు. సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'పొటాష్ కొంటేనే.. యూరియా' కథనానికి ఆయన స్పందించారు. చిట్యాలలోని మన గ్రోమోర్ సెంటర్‌తోపాటు పీఏసీఎస్ సెంటర్, యమునా ఆగ్రో ఏజెన్సీస్, శ్రీ లక్ష్మీనర్సింహ ట్రేడర్స్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొనుగోలులో ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అవసరమైన మేరకు ఎరువులు, విత్తనాలను అందించాలని సూచించారు. ఎరువులు, విత్తనాల ధరలను ఎంఆర్‌పీ రేటుకు మించి అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన సెల్ నంబర్ 7288894506 కు కాల్ చేసినట్లయితే సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.


చిట్యాలలో మన గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ గిరిబాబు

రిజర్వాయర్ పనులు అడ్డుకున్న నిర్వాసితులు


పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు

మర్రిగూడ: తమ భూములు, ఇల్లు సర్వస్వం కోల్పోయి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తే ఊరిలో సర్వే సమయానికి లేరనే సాకుతో తమది ఈ ఊరు కాదని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించకపోవడం శోచనీయమని నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందని 19 కుటుంబాలు మంగళవారం శివన్నగూడ రిజర్వాయర్‌లో పనిచేస్తు వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రాజెక్టు ఈఈ రాములునాయక్, డీఈ ఖాసీం నిర్వాసితుల వద్దకు వచ్చి ప్రభుత్వం నుంచి సహాయం అందించే విధంగా చొరవ చూపుతామని భరోసా ఇచ్చారు. నాంపల్లి సీఐ అనంతుల నవీన్‌కుమార్, ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో నిర్వాసితులు ముద్దం నర్సింహ, పెంటయ్య, రేణుక, బోఝపల్లి కృష్ణ, మల్లమ్మ, పద్దమ్మ, నగేష్, జయమ్మ, రాములు, దాసు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం

నకిరేకల్ : పెద్దగట్టు జాతరకు వెళ్తున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: హైదరాబాద్ నుంచి దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు వెళ్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మార్గమధ్యలో కేతేపల్లి మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ జంక్షన్ వద్ద ఆగిన కవితకు స్థానిక మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు బొకేలు, శాలువాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా కవిత మహిళలతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, చల్ల కృష్ణారెడ్డి, కొండ సైదులు, ఎం.విజయరాణి, టంగుటూరి వెంకన్న, దండు వెంకటేష్, పెరిక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్ : కవితకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిట్యాల: హైదరాబాద్ నుంచి సూర్యాపేట పెద్దగట్టు లింగమంతుల జాతరలో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యలో చిట్యాలలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం కాసేపు ఆగారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శ్రీనివాస్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిట్ట బోందయ్య, కోనేటి ఎల్లయ్య, కూనురు శంకర్, జిట్ట శేఖర్, ఆవుల ఆనంద్, కోనేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మర్రిగూడ : రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పాండురంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. భూ భారతి లాగిన్ ఓపెన్ కాకపోవడంతో రైతులు తమ భూ సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, రియావుద్దీన్ పాండు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రంలో చేనేత కార్మికుడు బోల్ల రామచంద్రం రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కాగా మంగళవారం పలు వురు నాయకులు రామచంద్రంను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం రు.10 వేలు, మాజీ ఎంపీపీ అవ్వారి గీతాశ్రీనివాస్ రు.5 వేలు, మాజీ ఎంపీటీసీ చెరుపల్లి భాస్కర్ రూ.5 వేలు అందజేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు చంద్రయ్య, కర్నాటి అశోక్, అంజయ్య పున్న కిశోర్, కర్నాటి అబ్బయ్య, ఆనంద్, అయోధ్య, సూరెపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

ఎంజీ యూనివర్సిటీలో ఏఐపై అవగాహన

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో మంగళవారం బీటెక్, ఎంసీఏ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డీప్ లెర్నింగ్ మెథడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు కృష్ణ హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో ప్రాజెక్టుల రూపకల్పనలో, సమకాలీన అంశాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంలోకి రానుందని అన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు లక్ష్మీశ్రీనివాసరెడ్డి, వి. సుకన్య ప్రాజెక్టుల రూపకల్పన, ఆరోగ్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం గురించి వివరించారు. భూగర్భజలాలు, పశువులు, పక్షుల పెంపకం, వ్యవసాయం వంటి రంగాల్లోనూ ఏఐ వినియోగంపై పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, జయంతి, హరీష్‌కుమార్, సంధ్యారాణి, సీహెచ్ స్వర్ణలత, జ్యోతిరాణి, రాజేశ్వరి, దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

నల్లగొండ : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ కృష్ణారావు అన్నారు. మంగళవారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ట్రాన్స్‌కో డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ హాకీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హాకీలో 6 జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో 8 జట్లు పోటీలో పాల్గొన్నాయి. హాకీలో నల్లగొండ జట్టు విద్యుత్ సౌధ జట్టుపై 3 గోల్స్ తేడాతో విజయం సాధించింది. తర్వాత పోటీలో నిజామాబాద్‌పై 2-0 తో వరంగల్ విజయం సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ తిరుగుడు శ్రీనివాస్, ఆపరేషన్ డీఈ అన్నయ్య. ఎంఅండ్‌పీ ఏడీఈ నరేందర్‌రావు, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కరెంట్‌రావ్, అంజల్ రావు, సలీం, ఫరూక్, నిమ్మచెట్ల వెంకటయ్య, సురేష్‌కుమార్, గిరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారావు

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: తెలంగాణ రైతు సంఘం చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా బొబ్బలి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా అర్రూరి శ్రీను, ఉపాధ్యక్షులుగా లడే రాములు, సుర్కంటి మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మెట్టు నర్సింహ, ఉయ్యాల సత్తయ్య, కోశాధికారిగా రూపని ఇద్దయ్య తోపాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.


ఏఎమ్మార్పీ తూము వద్ద ఉద్రిక్తత


ఇండ్లూరు సమీపంలో సబ్ కెనాల్ వద్ద మూసిన తూమును తెరుస్తున్న మామిడాల రైతులు

తిప్పర్తి : మండలంలోని ఇండ్లూరు సమీపంలో డీ-40 కాలువకు సంబంధించిన మైనర్ కాలువ ఎల్-11 మూడో తూము నుంచి మామిడాల, యాపలగూడం చెరువుల్లోకి ఏఎమ్మార్పీ నీరు వెళ్తుంటాయి. అయితే ఆ తూమును దిగువన ఉన్న మోత్కూర్ గ్రామానికి చెందిన రైతులు మూసేసి కిందకు నీరు తరలిస్తున్నారు. మంగళవారం మామిడాల గ్రామానికి చెందిన రైతులు పూడ్చిన తూమును తెరిచారు. దీంతో తూము వద్ద ఉద్రిక్తత నెలకొంది. సంఘటన స్థలాన్ని ఐబీ ఏఈ అనుపమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్ సందర్శించి రైతులకు నచ్చజెప్పారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

నార్కట్‌పల్లి : ఛత్రపతి శివాజీని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్రీయ శివాజీ సేన సంస్థ వ్యవస్థాపకుడు తాడోజు శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలం యల్లారెడ్డిగూడెంలో జరిగిన సంస్థ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెక్యులరిజం పేరుతో దేశంపై, సనాతన హింధూ ధర్మంపై వివిధ రూపాల్లో కొంత మంది స్వయం ప్రకటిత మేధావులు విషం కక్కుతున్నారని అన్నారు. అనంతరం నార్కట్‌పల్లి మండల రాష్ట్రీయ శివాజీ సేన అధ్యక్షుడిగా తాడోజు శివకుమార్‌ను ప్రకటించి నియామక పత్రం అందజేశారు.


శివకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాసాచారి

అర్హుల జాబితా తయారు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కట్టంగూర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఎస్‌పీ రాజ్‌కుమార్ సూచించారు. మంగళవారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జీఓ నెంబర్ 7 ప్రకారం అర్హుల జాబితా, ఎల్1 జాబితాపై, లబ్ధిదారుల ఎంపికపై అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమళ్ల చలపతి, పంచాయతీ కార్యదర్శులు గాద శ్రీధర్‌రెడ్డి, జయసుధ, రేణుక, వడ్లకొండ అశోక్ తదితరులు ఉన్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తాం

నల్లగొండ టౌన్: దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయకుంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని దళిత బంధు సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోకిల మహేష్ అన్నారు. నల్లగొండలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం జరిగిన దళిత బంధు సాధన కమిటీ ఉమ్మడి జిల్లా బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలోని 1050 మంది దళిత లబ్ధిదారులకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, బొర్ర సుధాకర్, కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్ అవుట రవీందర్, ఖతర్నాక్, ఆదిమల్ల లింగయ్య, పేర్ల అశోక్, పెరిక యాదయ్య, ఈర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23న మహాసభ

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహాసభ ఈ నెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మహాసభ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ ఇన్‌చార్జ్ కేవీ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యాంసుందర్‌గౌడ్, గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వెంకన్న, బి.శ్రీనివాస్, అందుగుల గణేశ్, గద్దపాటి వెంకన్న, గిరి నాగయ్య, మహేష్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

పూల రవీందర్‌ను గెలిపించాలని తీర్మానం

చండూరు : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని మునుగోడు నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంగళవారం చండూరు పట్టణ కేంద్రంలో జరిగిన మున్నూరు కాపు సంఘం ముఖ్యుల సమావేశంలో పూల రవీందర్ గెలుపునకు ఐక్యంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అఖిల భారత హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య, పర్వతం సతీష్, నియోజకవర్గం కోఆర్డినేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, సంగు జానయ్య, కంచర్ల భిక్షమయ్య, శిరంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


మల్లేషం, ఎంఈఓ

మునుగోడు: మండల నూతన విద్యాధికారిగా టి.మల్లేషం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన కె.రవి జిల్లా సెక్టోరియల్ అధికారిగా నల్లగొండకు బదిలీపై వెళ్లారు. దీంతో కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మల్లేషంకు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు.

కల్వలపల్లి వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న శ్రవణ్‌కుమార్

మునుగోడు : మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన పాలరపు శ్రవణ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.మంగు పర్యవేక్షణలో విద్యుత్ నాణ్యత పెరుగుదల మరియు రియాక్టర్ పవర్ మేనేజ్‌మెంట్ కోసం హైబ్రిడ్ ఫిల్టర్ పనితీరుపై చేసిన విశ్లేషణకు గాను శ్రవణ్‌కుమార్‌కు డాక్టరేట్ వచ్చింది.

రాజీవ్ ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారికి సన్మానం


శివప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

నల్లగొండ: ఉమ్మడి జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారిగా నియమితులైన డాక్టర్ బానోతు శివప్రసాద్‌ను మంగళవారం హైదరాబాద్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గోలి నాగరాజు, బురుగు సైదులు, నరేష్‌కుమార్, గోవిందరెడ్డి, మల్లయ్య, రోజా, రాధ, ఏమిరెడ్డి లక్ష్మీ, వరలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

తీరిన విద్యుత్‌లో ఓల్టేజీ కష్టాలు

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామంలో ప్రజలు విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి.. 10కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను 25 కేవీఏగా మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడంతో గ్రామస్తులకు విద్యుత్ లో ఓల్టేజీ సమస్య తీరింది. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ వైద్యుల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో జరిగే సభకు వెళ్తున్న గ్రామీణ వైద్యులను మంగళవారం స్థానిక టూటౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు దోరేపల్లి మల్సూర్, జిల్లా కోశాధికారి పగిడిమర్రి గోవర్దనాచారి మాట్లాడారు. శిక్షణ పొందిన 13వేల మంది కమ్యూనిటీ పారామెడికల్‌కు వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయాలని, మిగిలిన వారికి ఆరు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు శ్రీనివాస్, రామ్, ఎస్‌కె.అప్జల్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలని ప్రచారం

నల్లగొండ టూటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నల్లగొండలోని ఎస్ఆర్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మిర్యాల వెంకన్న, పాశం శ్రీనివాస్‌రెడ్డి, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పిన్నింటి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.